AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAYNEWS.COM

21-9-2026 (Monday)

MAIN EDITION

ఎర్రవల్లిలో సర్వే పునఃప్రారంభం



అక్షరటుడే, సిద్దిపేట : మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసర ప్రాంతాల్లోని భూములపై రెవెన్యూ శాఖ అధికారులు సమగ్ర విచారణ, సర్వేను వేగవంతం చేశారు. ఆదివారం సెలవు రోజు కావడంతో నిలిచిపోయిన సర్వే.. సోమవారం ఉదయం నుంచి యథావిధిగా కొనసాగుతోంది. ముఖ్యంగా ఎర్రవల్లితో పాటు దాని శివారు గ్రామాలైన వెంకటపూర్, వరదరాజుపూర్ సరిహద్దుల పరిధిలోని సర్వే నంబర్ 325లో ఉన్న ప్రభుత్వ, అసైన్డ్ భూములపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ అత్యవసర భేటీ



అక్షరటుడే, హైదరాబాద్ సిటీ : తెలంగాణలో అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ మధ్య పొలిటికల్ వార్ తారాస్థాయికి చేరింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సీనియర్ నేత హరీశ్ రావు ఆధ్వర్యంలో తెలంగాణ భవన్‌లో ఆ పార్టీ ముఖ్యనేతలు అత్యవసరంగా సమావేశమయ్యారు. కాంగ్రెస్ దూకుడుకు చెక్ పెట్టేలా కౌంటర్ ఎటాక్ చేయడానికి బీఆర్ఎస్ నాయకులు ఈ సమావేశంలో లోతుగా చర్చిస్తున్నారు. ప్రజాక్షేత్రంలోనే ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని ఆ పార్టీ భావిస్తోంది.

నకిలీ మందుల దందా గుట్టు



అక్షరటుడే, కర్ణాటక: మందులకు నకిలీ లేబుళ్లు వేసి కోట్లాది రూపాయలు కొల్లగొడుతున్న నకిలీ మందుల ముఠా గుట్టును కర్ణాటక ఆహార భద్రత, ఔషధ పరిపాలన శాఖ రట్టు చేసింది. నకిలీ మందుల తయారీ, విక్రయాల అక్రమాలకు పాల్పడుతున్న 16 సంస్థల లైసెన్సులను పూర్తిగా రద్దు చేశారు.

తాగునీటి వృథా.. ఐదుగురికి జరిమానా



అక్షరటుడే, హైదరాబాద్ సిటీ: తాగునీటి వృథాను అరికట్టేందుకు జలమండలి అధికారులు తనిఖీలు చేపడుతున్నారు. సోమవారం ఉదయం నీటి సరఫరా సమయంలో జూబ్లీహిల్స్‌లో ఆకస్మికంగా తనిఖీ చేశారు. తాగునీటిని వృథా చేస్తున్న ఐదుగురు వినియోగదారులను గుర్తించారు. వారికి జరిమానా వేశారు.

28 కిలోల గంజాయి స్వాధీనం.. ముగ్గురి అరెస్ట్



అక్షరటుడే, వెబ్‌డెస్క్: మల్కాజ్‌గిరిలో జరిగిన రెండు వేర్వేరు ఘటనల్లో ఎక్సైజ్ పోలీసులు 28 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. హైదరాబాద్ నగరంలో గంజాయి దందా జోరుగా సాగుతోంది. పోలీసులు, ఈగల్ ఫోర్స్, ఎక్సైజ్ అధికారులు దాడులు చేస్తున్నా.. గంజాయి విక్రయాలు ఆగడం లేదు.

23 నుంచి భారీ వర్షాలు



అక్షరటుడే, హైదరాబాద్ సిటీ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తెలంగాణలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ నిపుణులు తెలిపారు. అల్పపీడనం ఈ నెల 23న శ్రీకాకుళం సమీపంలో తీరం దాటే అవకాశం ఉందన్నారు. దీంతో 23 నుంచి 25 వరకు వర్షాలు కురిసే ఛాన్స్ ఉంది. ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు పడుతాయి. మధ్య, దక్షిణ తెలంగాణలో మోస్తరు నుంచి భారీ వానలు పడే ఛాన్స్ ఉంది. పశ్చిమ తెలంగాణ జిల్లాల్లో మోస్తరు జల్లులు కురుస్తాయి.

ట్యాంక్ బండ్ వద్ద ఉద్రిక్తత

అక్షరటుడే, సికింద్రాబాద్ : హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్ వద్ద గణేష్ విగ్రహాల నిమజ్జన ఆంక్షలు తీవ్ర వివాదానికి, ఉద్రిక్తతకు దారితీశాయి. ట్యాంక్ బండ్‌లో నిమజ్జనాన్ని నిషేధించడాన్ని నిరసిస్తూ భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు సోమవారం అక్కడ ఆందోళనకు దిగారు. అధికారులు ఏర్పాటు చేసిన బారికేడ్లను తొలగించడంతో ఒక్కసారిగా పరిస్థితి ఉద్రిక్తతంగా మారింది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు భారీగా మోహరించి, నిరసన తెలుపుతున్న ఉత్సవ కమిటీ నాయకులను అరెస్ట్ చేసి గాంధీనగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

జూరాల వద్ద ఉద్రిక్తత



జూరాల ప్రాజెక్ట్ వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. గద్వాల జిల్లాలోని ఈ ప్రాజెక్ట్ నుంచి ఆయకట్టుకు సాగునీరు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు. వారికి మద్దతుగా బీఆర్ఎస్ నాయకులు సోమవారం నిరసనలకు పిలుపునిచ్చారు. దీంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో తోపులాట చోటు చేసుకుంది. పలువురు నాయకులు, రైతులను పోలీసులు అరెస్ట్ చేశారు.

- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

■ ఆయకట్టుకు నీరివ్వాలని బీఆర్ఎస్ నిరసన
■ అడ్డుకున్న పోలీసులు ■ పలువురి అరెస్ట్

రైతుల ఆందోళనలకు మద్దతుగా డ్యాం పైన ధర్నాకు బీఆర్ఎస్ పిలుపునివ్వడంతో ఉదయం నుంచే ప్రాజెక్టును పోలీసులు తమ అధీనంలోకి తీసుకున్నారు. ప్రాజెక్టుకు వెళ్లే అన్ని మార్గాల్లో భారీగా మోహరించారు. భారీకేట్లు, పోలీసు వాహనాలు అడ్డుపెట్టి ఆ మార్గంలో వచ్చే వాహనాలను తనిఖీ చేశారు. ఆత్మకూరు గద్వాల రహదారిపై రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. ధర్నాకు వెళ్లకుండా మాజీమంత్రి నిరంజన్ రెడ్డిని హౌస్ అరెస్ట్ చేశారు. పలువురు బీఆర్ఎస్ నేతలను సైతం ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు.

మాజీ ఎమ్మెల్యే అరెస్ట్

మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి డ్యామ్‌పైకి వెళ్లేందుకు యత్నించారు. ఆయనను పోలీసులు అరెస్ట్ చేశారు. రైతులు, బీఆర్ఎస్ నాయకులు ఆయనను అరెస్ట్ చేయకుండా అడ్డుకున్నారు. పోలీసులు వాహనానికి అడ్డుగా పడుకొని నిరసన తెలిపారు. రోడ్డుపై అడ్డంగా కట్టెలు రాళ్లు పేర్చి, పోలీసు వాహనం వెళ్లకుండా చేశారు. దీంతో పోలీసులు వారిని పక్కకు లాగేశారు. ఈ క్రమంలో తోపులాట చోటు చేసుకుంది. పలువురు రైతులు పోలీస్ నిర్బంధాన్ని దాటి జూరాల వద్దకు చేరుకున్నారు. కాల్వలోకి దిగి నిరసన తెలిపారు.

సర్కార్ విఫలం

రైతులు, బీఆర్ఎస్ నాయకుల అరెస్ట్‌పై మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడారు. శ్రీశైలం నుండి 670 కిలోమీటర్ల దూరంలో కుప్పంకి నీళ్లు పోతున్నాయని, 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న పాలమూరుకు ప్రభుత్వం నీరు ఇవ్వడం లేదని మండిపడ్డారు. కుప్పంలో అక్కడి ప్రభుత్వం జలహారతి ఇస్తుంటే, ఇక్కడ రైతులు సాగునీటి కోసం కన్నీళ్లు పెట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు నీరు ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.

రాష్ట్రంలో ఫామ్‌హౌస్ రాజకీయాలు



అక్షరటుడే, హైదరాబాద్ : రాష్ట్రంలో ఫామ్‌హౌస్ రాజకీయాలు హాట్ టాపిక్‌గా మారాయి. కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ఇతర బీఆర్ఎస్ నాయకుల ఫామ్‌హౌస్‌లను సందర్శిస్తుండటం గమనార్హం. జన్వాడలోని కేటీఆర్ ఫామ్‌హౌస్, మొయినాబాద్, అజీజ్‌నగర్‌లోని ఇతర నేతల ఫామ్‌హౌస్‌లను వారు సందర్శించారు. దీనిపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. రాష్ట్రంలో వారి ప్రభుత్వమే ఉందని, సదరు ఫామ్‌హౌస్‌లు అక్రమ నిర్మాణాలు అయితే కూల్చకుండా ఇలా సందర్శిస్తే లాభం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. సందర్శనల పేరిట రాజకీయాలు చేస్తుండటంపై నెటిజన్లు విమర్శిస్తున్నారు.

రైతులపై అక్రమ కేసులు.. కేటీఆర్ ఆగ్రహం



అక్షరటుడే, హైదరాబాద్ సిటీ : జూరాల ప్రాజెక్ట్ నుంచి నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేసి బీఆర్ఎస్ నేతలను, రైతులను అరెస్ట్ చేయడాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఖండించారు. రాష్ట్రంలో సాగుతున్న అణచివేతకు ఇది ఉదాహరణ అని ఆయన అన్నారు. పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంటలను కాపాడుకోవడానికి రైతులు జూరాల గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తే.. ప్రభుత్వం వారిపై అక్రమ కేసులు పెట్టిందని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి అన్నదాతలను అరిగోస పెడుతున్నారని పేర్కొన్నారు.

మూడు రోజుల పాటు బ్యాంకర్ల సమ్మె



అక్షరటుడే, బిజినెస్ డెస్క్ : తమ డిమాండ్లు నెరవేర్చాలని బ్యాంకర్లు సమ్మెకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. సెప్టెంబర్ 28 నుండి 30 వరకు మూడు రోజుల పాటు సమ్మెకు దిగారు. ఈ క్రమంలో ఎస్‌బీఐ తన ఖాతాదారులకు కీలక సూచనలు చేసింది. సమ్మె కాలంలో ఎదురయ్యే అంతరాయాలను నివారించడానికి, ముఖ్యమైన బ్రాంచ్ సంబంధిత పనులను ముందుగానే పూర్తి చేసుకోవాలని బ్యాంకు వినియోగదారులను కోరింది. ఈ నెల 28 నుంచి 30 వరకు మూడు రోజులు సమ్మె చేపట్టనున్నారు. దీంతో ఆ రోజుల్లో బ్యాంకులు పని చేయవు. 26న నాలుగో శనివారం, 27న ఆదివారం కావడంతో సెలవు ఉంటుంది. దీంతో 5 రోజుల పాటు బ్యాంకులు బంద్ ఉండనున్నాయి.

షూటింగ్‌లో భారత్‌కు మరో రెండు పతకాలు



అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్ : జపాన్‌లో జరుగుతున్న ఆసియా క్రీడల్లో భారత షూటర్లు పతకాల పంట పండిస్తున్నారు. ఈ విభాగంలో ఇప్పటి వరకు 5 పతకాలు గెలుచుకున్నారు. సోమవారం 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో హిమాన్షు ధిల్లాన్ రజత పతకాన్ని గెలుచుకోగా, రుద్రాంక్ష్ పాటిల్ కాంస్యం సాధించాడు. మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్‌లో ఒక పతకం వచ్చింది. దీంతో భారత ఖాతాలో నాలుగు రజత, రెండు కాంస్య పతకాలు చేరాయి. పాయింట్ల పట్టికలో ప్రస్తుతం ఇండియా పదో స్థానంలో ఉంది.



దానం నాగేందర్ పిటిషన్‌పై బుధవారం విచారణ

అక్షరటుడే, ఢిల్లీ: దానం నాగేందర్ అనర్హత వ్యవహారంపై దాఖలైన పిటిషన్‌ను బుధవారం విచారిస్తామని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం వెల్లడించింది. పార్టీ ఫిరాయింపుల కేసులో తనపై అనర్హత వేటు వేస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దానం నాగేందర్ సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌ను సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి సుప్రీంకోర్టులో ప్రత్యేకంగా ప్రస్తావించారు. స్పీకర్ తిరస్కరించిన పిటిషన్‌ను పరిగణలోకి తీసుకుని హైకోర్టు దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటించిందని, ఈ కేసులో అత్యవసరంగా విచారణ జరపకపోతే ఉప ఎన్నిక వచ్చే అవకాశం ఉందని ఆయన కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

అఫ్గానిస్థాన్‌పై పాకిస్థాన్ వైమానిక దాడి

అక్షరటుడే, నేషనల్ డెస్క్: తూర్పు అఫ్గానిస్థాన్‌పై పాక్ యుద్ధ విమానాలు విరుచుకుపడ్డాయి. సరిహద్దుకు సమీపంలో ఉన్న కునార్, పక్తికా ప్రాంతాలపై పాక్ జెట్లు బాంబుల వర్షం కురిపించడంతో స్థానికంగా తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. కునార్ ప్రావిన్స్‌లోని నూర్గల్ జిల్లా పతంగ్ ప్రాంతంలో రాత్రి సుమారు 3:30 గంటల సమయంలో ఈ దాడి జరిగింది. చాలా తక్కువ ఎత్తులో దూసుకొచ్చిన పాకిస్థాన్ యుద్ధ విమానాలు సాధారణ పౌరుల ఇళ్లను లక్ష్యంగా చేసుకుని బాంబులు జారవిడిచాయి.





విజయవాడలో ఉద్రిక్తత

అక్షరటుడే, ఏపీ : విజయవాడలో ఉద్రిక్తత ఓటు చేసుకుంది. డీఎస్సీలో అక్రమాలు జరిగాయని వైసీపీ నాయకులు శాప్ కార్యాలయం వద్ద ధర్నాకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. పెద్ద ఎత్తున ఆ పార్టీ నాయకులు తరలిరావడంతో అక్కడ భారీగా పోలీసులు మోహరించారు. వైసీపీ నిరసనలకు అనుమతి లేదని పేర్కొన్నారు. పోలీసులను తప్పించుకొని వైసీపీ నాయకులు శాప్ కార్యాలయానికి వచ్చారు. కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఈ క్రమంలో అక్కడకు టీడీపీ నాయకులు సైతం తరలి వచ్చారు. దీంతో ఇరు పార్టీ నేతల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అనంతరం బాహాబాహీకి దిగారు. ఇరువర్గాల కార్యకర్తలను అడ్డుకుని పోలీసులు చెదరగొట్టారు.

కానిస్టేబుల్ ఆత్మహత్య

అక్షరటుడే, హైదరాబాద్ సిటీ : హైదరాబాద్ నగరంలోని మలక్‌పేటలో ఓ పోలీస్ కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్నాడు. మూసారాంబాగ్ శాలివాహన నగర్‌లో ఆదివారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. ముత్తె చంద్రశేఖర్ (35) అంబర్‌పేట్ హెడ్‌క్వార్టర్స్‌లో కానిస్టేబుల్ రైటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం రాత్రి ఆయన ఓ యువతికి వీడియో కాల్ చేశాడు. తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు ఆమెకు చెప్పాడు. దీంతో వెంటనే ఆమె పోలీసులకు సమాచారం ఇచ్చింది. మలక్‌పేట పోలీసులు ఘటన స్థలానికి చేరుకునే లోపే చంద్రశేఖర్ ఉరి వేసుకున్నాడు.

